
సాక్షి మంచిర్యాల

బుధవారం ; 16 ; అక్టోబర్ ; 2024



భీం.. మళ్లీ పుట్టాలి 10లో▸

జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో హక్కుల కోసం కుమురంభీం పోరాటం చేశాడు. నేటికీ తాగు, సాగునీరు లేక ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు.



పోలీస్ స్పోర్ట్స్ మీట్ 10లో▸

హాజీపూర్ మండలం గుడిపేట బెటాలియన్‌లో పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నారు. మంగళవారం పోటీలను బెటాలియన్ కమాండెంట్ ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఈశాన్యం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

గురుకులాల్లో అద్దె మోత!

- యజమానులకు రూ.లక్షల్లో బకాయిలు
- సొంతంగా లేక ప్రైవేటు భవనాల్లో వెల్లదీత
- శాశ్వత పరిష్కారం లేక విద్యార్థులకు తిప్పలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపితే మేలు



మందమర్రిరూరల్: ప్రధాన గేట్‌కు తాళం వేసిన భవన యజమాని

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే గురుకులాలకు పక్కా భవనాలు లేక అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రైవేటు భవనాల్లో ఉన్న చోట్ల ప్రభుత్వం తమకు అద్దె చెల్లించడం లేదంటూ యజమానులు భవనాలకు తాళం వేయడంతో బోధనపై ప్రభావం చూపుతోంది. దసరా సెలవుల తర్వాత కొన్ని చోట్ల విద్యార్థులు పూర్తి స్థాయిలో రానప్పటికీ మరికొన్ని చోట్ల వసతిగృహాల గేట్లకు యజమానులు మంగళవారం ఉదయమే తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు నచ్చజెప్పడంతో తిరిగి మధ్యాహ్నం వరకు తెరిచారు. కొన్ని చోట్ల బకాయిలు ఉన్నా భవన యజమానులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉచితంగా విద్య, వసతితో కూడిన చదువు అందుతోందనే ఆశతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పిస్తున్నారు. ఇందుకు ప్రవేశ పరీక్షలు నిర్వహించి ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నారు. పక్కా భవనాలు లేని కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, బీసీ పరిధిలోని గురుకులాలు, వసతిగృహాల్లో దాదాపు పది వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు.

రూ.లక్షల్లో అద్దెలు..

జిల్లాలో గురుకులాలకు పక్కా భవనాలు లేక ప్రైవేటు భవనాలకు నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో మూడు మైనార్టీ గురుకులాలు ఉండగా, మంచిర్యాల, బెల్లంపల్లి(బాలికలు), చెన్నూర్(బాలురు) వసతిగృహాల్లో 1500 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. ఈ మూడూ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనాలకు స్థలం కేటాయించినా నిధులు లేక ముందుకు సాగడం లేదు. దీంతో ఒక్కో గురుకులానికి నెలకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు అద్దె చెల్లించాల్సి వస్తోంది. గత జనవరి నుంచి అద్దె బకాయిలు ఉన్నాయి.

- బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ఎనిమిది ఉండగా.. వీటిలో ప్రీమెట్రిక్ మూడు బాలికలు, ఐదు బాలురు, 8 పోస్టు మెట్రిక్ పరిధి నాలుగు చొప్పున, బాలబాలికలకు మొత్తం 8వసతిగృహాలు ఉన్నాయి. ఒక్కో చోట వంద మంది మాత్రమే ఉంటున్నారు. వీటిలో ఆరు చోట్ల ప్రైవేటు భవనాల్లో కొనసాగుతునాయి. వీటికి ఎనిమిది నెలల నుంచి అద్దె చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. వీటితోపాటు లక్సెట్టిపేట, మంచిర్యాల, చెన్నూర్, మందమర్రి, తాండూర్, బెల్లంపల్లిలో బీసీ గురుకులాలతోపాటు ఓ జూనియర్ కాలేజీ ఉంది. వీటిలో లక్సెట్టిపేటలో మాత్రమే సొంత భవనంలో కొనసాగుతోంది.
- సోషల్ వెల్ఫేర్ పరిధిలో లక్సెట్టిపేట, చెన్నూరు, బెల్లంపల్లి, కాసిపేటలో మొత్తం ఆరు ఉండగా, వీటిలో ఒకటి మాత్రమే సొంత భవనంలో ఉంది. మంచిర్యాల సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఉన్న డిగ్రీ కాలేజీ సైతం అద్దె భవనంలోనే ఉంది. కేటాయించిన మండలాలైన కాసిపేట గురుకులం బెల్లంపల్లిలో, కోటపల్లి గురుకులం జైపూర్‌లో, మంచిర్యాల గురుకులం గుడిపేటలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రైవేటు భవనాల్లో నెలకు కనీసం రూ.30వేల నుంచి రూ.2లక్షల దాకా చెల్లించాల్సి ఉంది. ఒక్కో భవనానికి ఎనిమిది నెలల నుంచి రెండేళ్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇక అద్దె ఖరారు కమిటీ సిఫారసుతోపాటు స్థానికంగా ఉన్న విలువను బట్టి అద్దె ఖరారు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏటా ఐదు శాతం పెంచాలి. బకాయిలు పేరుకుపోవడంతో కొందరు యజమానులు రెన్యూవల్ చేసుకునేందుకు కూడా ముందుకు రావడం లేదు. అయినా ఆ భవనాల్లోనే గురుకులాలు కొనసాగుతున్నాయి. మరోవైపు సర్కారు సరిగా అద్దెలు చెల్లించకపోవడంతో మెరుగైన సౌకర్యాలు అందడం లేదు. ఏవైనా మరమ్మతులు వచ్చినా యజమానులు పట్టించుకోవడం లేదు.

ప్రత్యామ్నాయం వెతికితేనే..

సర్కారు ఉన్నత ఆశయంతోనే గురుకులాల ఏర్పాటు చేసినప్పటికీ శాశ్వత భవనాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. దీంతో తాత్కాలికంగా ప్రైవేటు భవనాల్లోనే విద్యార్థులకు బోధన, వసతి కొనసాగుతున్నాయి. సర్కారుకు అద్దె భారం కాకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా జిల్లాలోని ప్రభుత్వ, సింగరేణి భవనాలు ఉపయోగించుకునే అవకాశం ఉంది. బెల్లంపల్లి, తాండూరు, మందమర్రి, జైపూర్, చెన్నూరు పరిధిలో అవకాశం ఉంది. కానీ అధి కారులు ఆ వైపు ఆలోచనలు చేయడం లేదు. మరో వైపు కొందరు భవన యజమానులకు మేలు చేసేందుకే ఆయా చోట్ల గురుకులాలను కొనసాగిస్తున్నార నే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఇక శాశ్వత భవనాల నిర్మాణం కోసం స్థలాల కేటాయింపు, నిధుల మంజూరుపైనా పట్టింపు కరువైంది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవతో ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అద్దె సమస్య పరిష్కరిస్తేనే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తిప్పలు తప్పనున్నాయి.

పాఠశాల గేట్‌కు తాళం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాల గేటుకు మంగళవారం భవన యజమాని తాళం వేశారు. ప్రభుత్వం అద్దె సక్రమంగా చెల్లించడం లేదని అద్దె భవనాల యజమానుల పిలుపు మేరకు తాళం వేసినట్లు పేర్కొన్నారు. నెలకు రూ.2లక్షల చొప్పున ఎనిమిది నెలల అద్దె బకాయి ఉందని తెలిపారు. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండడంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు కొందరు చిన్న గేట్ ద్వారా లోపలికి వెళ్లారు. ఈ విషయాన్ని సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బెల్లంపల్లిలో..



గురుకుల గేట్‌కు తాళం వేస్తున్న భవన యజమాని

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు భవన యజమాని మంగళవారం తాళం వేశారు. కొన్ని నెలల నుంచి ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు. దసరా సెలవుల తర్వాత వచ్చిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కొందరు బాలికలు తాళం వేసి ఉండడం చూసి ఆందోళనకు గురయ్యారు. గురుకుల ప్రిన్సిపాల్ వినతి మేరకు భవన యజమాని భావనరుషి మధ్యాహ్నం తాళం చెవిని అందజేశారు. ఈ ఘటనపై భవన యజమానిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తాండూర్‌లో..



గురుకుల పాఠశాల ముందు రోడ్డు పక్కన ఉన్న ఉపాధ్యాయులు

తాండూర్: తాండూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల భవనానికి మంగళవారం భవన యజమాని తాళం వేశారు. రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం నిర్ణయం మేరకు తాళం వేసినట్లు యజమాని సురభి శరత్‌కుమార్ తెలిపారు. గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరు బయట ఉండాల్సి వచ్చింది. ఎంపీడీవో శ్రీనివాస్, పలువురు అధికారులు భవన యజమానితో సంప్రదింపులు చేసినా సమస్య కొలిక్కి రాలేదు. భవన యజమాని శరత్‌కుమార్‌పై ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

వేమనపల్లి: మండల కేంద్రం వేమనపల్లితోపాటు నీల్వాయి గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టోర్ రూం, ఓపీ వార్డు, సిబ్బంది గది పరిశీలించి వైద్యాధికారి లేకపోవడంపై ఆరా తీశారు. వర్షానికి స్టోర్‌రూం ఉరువకుండా మరమ్మతు చేయిస్తామని తెలిపారు. చికున్‌గున్యా, డెంగీ కేసులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ప్లాంట్ మరమ్మతు చేయించాలని సూచించా రు. అనంతరం మండల కేంద్రంలోని డంపింగ్‌యార్డును పరిశీలించారు. అక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ నిల్వలను చూసి అమ్మి వేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ప్రైమరీ స్కూల్‌ను పరిశీలించి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆ గ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరి శీలించారు. ఏహెచ్‌ఎస్ హాస్టల్‌కు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శి శ్యాంచందు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిని స్వంత భవనాలకు మార్చేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు తమ వివరాలు నమోదు చేసుకుని సమయానుసారంగా అవసరమైన పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేంజ్ అధికారిగా శ్రీనివాస్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా శ్రీనివాస్ మంగళవా రం బాధ్యతలు చేపట్టారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి హఫీజొద్దీన్ లక్సెట్టిపేటకు బదిలీపై వెళ్లగా మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న శ్రీనివాస్ ఇందన్‌పల్లి రేంజ్ అధికారిగా నియామకం అయ్యారు. అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం సిబ్బందితో కలిసి పని చేస్తానని పేర్కొన్నారు. అడవుల రక్షణ అందరూ బాధ్యతగా తీసుకుని అటవీ అధికారులకు సహకరించాలని కోరారు.

ప్రసూతి మరణాలు జరగకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రసూతి మరణాలు జరగకుండా వైద్యులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, గర్భిణులను వంద శాతం నమోదు చేసి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలని మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి అన్నారు. జిల్లాలో ఈ ఏడాది బెల్లంపల్లి, వేమనపల్లి, నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించి, మరణాలపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ అలివేణి, వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

నిరవధిక బంద్‌కు మద్దతు

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం చేపట్టిన నిరవధిక బంద్ రెండో రోజు మంగళవారమూ కొనసాగింది. స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని పలువురు డిమాండ్ చేశారు. నిరవధిక బంద్‌కు తెలంగాణ గుర్తింపు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా), విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి, రాజేశ్, ట్రస్మా నాయకులు విష్ణువర్ధన్‌రావు, ఉస్మాన్, పద్మచరణ్, దుర్గాప్రసాద్, కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్షించే తల్లికి ప్రత్యేక పూజలు

- నిజాంకు వ్యతిరేకంగా కుమురంభీం ఉద్యమం
- పోరాటంలో పోచమ్మ(అవ్వాల్‌పేన్) అండగా నిలిచిందని ఆదివాసీల నమ్మకం
- నేడు భీం వారసుల ఆధ్వర్యంలో మొక్కులు
- ఏర్పాట్లు చేసిన ఐటీడీఏ అధికారులు



జోడేఘాట్‌లో జెండాలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల హక్కుల కోసం కుమురంభీం ఎన్ని ఆటంకాలు ఎదురైనా నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. దట్టమైన అటవీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని బలమైన నిజాం సేనలను ఎదిరించారు. ఏళ్లపాటు సాగిన ఈ పోరాటంలో కుమురంభీంకు అవ్వాల్‌పేన్(పోచమ్మ) తల్లి అండగా నిలిచిందని ఆదివాసీలు నమ్ముతారు. ఏటా కుమురంభీం వర్ధంతికి ఒకరోజు ముందు అవ్వాల్‌పేన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో గురువారం కుమురంభీం వర్ధంతి నిర్వహించనుండగా.. బుధవారం సాయంత్రం పోచమ్మకు ఆయన వారసులు సంప్రదాయబద్ధంగా పూజలు చేయనున్నారు. ఇందుకోసం ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మంత్ర దండమే రక్ష..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు గ్రామాలకు నిజాం వ్యతిరేక పోరాటం విస్తరించింది. ఏళ్లపాటు పోరాడిన భీంకు పోచమ్మ(అవ్వాల్‌పేన్) మంత్రదండం నిజాం మిలటరీ నుంచి రక్షణగా నిలిచిందని ఆదివాసీలు విశ్వసిస్తారు. వేల సంఖ్యలో పోలీసులు చుట్టుముట్టి కాల్పులు జరిపినా తేనెటీగలను అస్త్రాలుగా చేసుకుని చాకచక్యంగా తప్పించుకునేవారని చెబుతుంటారు. ఆ నమ్మకంతోనే భీం వారసులు ఏటా పోచమ్మకు ఘనంగా పూజలు చేస్తారు. జోడేఘాట్‌లోని భీం సమాధి వద్ద నివాళులర్పించి అక్కడే ఉన్న జెండాలు ఎగురవేస్తారు.



పోచమ్మ గుడిలోని ప్రతిమలు

ఇక కొత్త టీచర్ల బోధన



కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు, మండల విద్యాధికారులు



పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్య

- పాఠశాలల కేటాయింపు ప్రక్రియ పూర్తి
- నేటి నుంచి సర్కారు బడిలో విధులు

మంచిర్యాలఅర్బన్: డీఎస్సీ–2024 నియామక అభ్యర్థులకు మంగళవారం రాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలల కేటాయింపు పూర్తి చేశారు. ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం ఉదయం 10గంటలకు విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని.. అక్కడికి వచ్చిన వారికి ఆదేశాలు రాలేదంటూ మధ్యాహ్నం మళ్లీ రావాలని అధికారులు సూచించడంతో గందరగోళం ఏర్పడింది. గంటకోమాట చెప్పడంతో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరికి కౌన్సెలింగ్ ప్రారంభమైన తర్వాత పాఠశాలల వారీగా ఖాళీలను గుర్తించి అభ్యర్థులకు తెలిసేలా ఇంటర్నెట్‌లో ఉంచారు. 288 ఉపాధ్యాయుల పోస్టులకు గాను 248మంది అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా.. అందులో 230మందికి మాత్రమే పాఠశాలల కేటాయింపు అవకాశం దక్కింది. మరో 18పోస్టులకు సంబంధించి ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించలేదు. మిగతా 230మందికి కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించడంతో కొత్త టీచర్లు బుధవారం నుంచి పాఠాలు బోధించనున్నారు.

కేటాయింపు ఇలా...

జాబితాలో ప్రదర్శించిన ఖాళీల్లో అనువైన పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియ సాగింది. టీచర్లు లేని పాఠశాల(సర్దుబాటు టీచర్లు కొనసాగుతున్న)కు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయించారు. పాఠశాలల్లో సబ్జెక్టు కొరత లేకుండా ప్రాధాన్యత ఇచ్చారు. పట్టణ ప్రాంతంలో ముగ్గురు టీచర్లకు ఇద్దరు టీచర్లు ఉండి పోస్టు ఖాళీగా ఉన్నా అసలే లేని మారుమూల ప్రాంతాల పాఠశాలలకు ప్రాధాన్యం కల్పించారు.

230 మంది..

మొత్తం 248 పోస్టులకు గాను 230మంది ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు61, ఎస్జీటీలు 169 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా.. 18 మంది ఈడబ్ల్యూఎస్, ప్రత్యేక అవసరాల టీచర్ల పోస్టుల(స్పెషల్ ఎడ్యుకేషన్)కు ఎంపికలు, కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించలేదు. ప్రస్తుత కౌన్సెలింగ్‌లో ఎస్జీటీ(తెలుగు) 149, ఉర్దూ 4, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 5, ఎస్ఏ సోషల్ 23, ఎస్ఏ ఫిజిక్స్ 1, ఎస్ఏ గణితం 9, ఎస్ఏ హిందీ 6, ఎస్ఏ ఇంగ్లిష్ 5, ఎస్ఏ బయోసైన్స్ 12, పీఈటీలు 3, ఎల్‌పీ 13 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించారు.

బదిలీ టీచర్లు రిలీవ్..

జిల్లాలో ఈ ఏడాది జూన్ చివరి వారంలో జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో 575 మంది ఎస్జీటీలు బదిలీ అయ్యారు. రిలీవర్స్ లేకపోవడంతో ఉపాధ్యాయులకు బదిలీకి అవకాశం లేకుండా పోయింది. దీంతో 50శాతం ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు కొత్తగా టీచర్లు రానుండడంతో ఎవరు రిలీవర్ వచ్చినా వారు అక్కడి నుంచి బదిలీ అయి కొత్త పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది. పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించామని, ఈ నెల 16న పాఠశాలల్లో చేరాలని డీఈవో యాదయ్య తెలిపారు.

భావితరాలను తీర్చిదిద్దాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవార కలెక్టరేట్‌లో డీఎస్సీలో అభ్యర్థుల పోస్టింగ్ కౌన్సెలింగ్‌కు డీఈవో ఎస్.యాదయ్యతో కలిసి హాజయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులతో మమేకమై వారికి అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేస్తూ ఉత్తమ ఫలితాల సాధించాలని తెలిపారు.

ఆర్టీసీకి దసరా జోష్

- పండుగ సీజన్‌లో 37లక్షల మంది ప్రయాణం
- 23 లక్షల మంది 'మహాలక్ష్మి'లే!
- కలిసివచ్చిన రైళ్ల రద్దు, మళ్లింపు
- సంస్థకు రూ.19కోట్ల మేర ఆదాయం



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ(ఫైల్)

డిపోల వారీగా ఆదాయం (రూ.లక్షల్లో..)

డిపో	ఆదాయం
ఆదిలాబాద్	402.37
భైంసా	199.10
నిర్మల్	496.28
ఉట్నూర్	90.99
ఆసిఫాబాద్	285.35
మంచిర్యాల	468.74
మొత్తం	1,942.81

ఆదిలాబాద్: ఆర్టీసీకి పండుగ సీజన్ కలిసివచ్చింది. దసరా, బతుకమ్మ సందర్భంగా సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. విజయదశమి పురస్కరించుకొని ఈనెల 2నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. అలాగే దూరప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం సొంతూళ్లకు పయణమయ్యారు. దీంతో బస్సులన్నీ కిటకిటలాడాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ రీజియన్ వ్యాప్తంగా 412 ప్రత్యేక బస్సులు నడపడంతో సంస్థకు రూ.19 కోట్ల 42 లక్షల రికార్డుస్థాయి ఆదాయం దక్కింది.

ఇక్కట్లు లేకుండా.. ప్రణాళికాబద్ధంగా

ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసిన ఆ ర్టీసీ అధికారులు తదనుగుణంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రద్దీ రూట్లలో బస్సులను ఎక్కువగా నడిపేలా ముందుగానే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. పకడ్బందీగా పర్యవేక్షణ చేసి విజయవంతమయ్యారు. మరోవైపు రైల్వేట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు రైళ్ల రద్దు అవ్వడం, డైవర్షన్ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇది సంస్థ ఆదాయం పెరగడానికి దోహదం చేసింది. ఇక గతేడాదితో పోలిస్తే ఈ సారి అధికంగా బస్సులను నడిపారు.

టికెట్ ఆదాయమే అధికం..

రీజియన్ పరిధిలో టికెట్ చెల్లించి ప్రయాణించిన వారు 14 లక్షల మంది ఉన్నారు. వీరి ద్వారా రూ.12.66 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా మహిళలే ప్రయాణం చేసినా టికెట్ ప్రయాణికుల చార్జీల నుంచే అధిక ఆదాయం సమకూరడం గమనార్హం. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో మాత్రమే అతివలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో ఆయా సర్వీసుల్లో మహాలక్ష్మి లబ్ధిదారులు ఎక్కువగా రాకపోకలు సాగించారు. ఇక సెమీడీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, లహరి వంటి సర్వీసుల్లో అధిక టికెట్ రేట్లు ఉండడం సంస్థ ఆదాయానికి ఊతమిచ్చింది.

'మహాలక్ష్మి'లే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 రోజుల వ్యవధిలో ప్ర యాణించిన ఆర్టీసీ ప్రయాణికుల్లో మహాలక్ష్మి లబ్ధిదారులే అధికంగా ఉన్నారు. రీజియన్ పరిధిలో 23,17,884 మంది ఈ పథకం ద్వారా ప్రయాణించారు. రోజుకు సగటున 1,65,000 మంది ప్రయాణించడం రద్దీ తీవ్రతను తెలుపుతోంది. అత్యధికంగా నిర్మల్ డిపో పరిధిలో 5,73,128 మంది అతివలు ఉచిత సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఆదాయంలో నిర్మల్ టాప్..

ఈ పండుగ సీజన్‌లో రీజియన్ పరిధిలో నిర్మల్ డిపో అత్యధికంగా రూ 4.96 కోట్ల ఆదాయాన్ని సాధించి అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత స్థానంలో మంచిర్యాల రూ.4.68 కోట్లు, ఆదిలాబాద్ రూ.4.02కోట్లు, ఆసిఫాబాద్ రూ. 2.85 కోట్లు, భైంసా రూ.1.99 కోట్లు, ఉట్నూరు రూ.99 లక్షలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తంగా ప్రత్యేక బస్సులు 34 లక్షల కిలోమీటర్లు ప్రయాణం చేసి, 37 లక్షల 73 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి.

అందరి సహకారంతోనే..

దసరా సీజన్ నేపథ్యంలో 15 రోజుల ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేశాం. క్షేత్రస్థాయిలో ఉద్యోగులను అప్రమత్తం చేశాం. ఎప్పటికప్పుడు డిపో మేనేజర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాం. మొత్తంగా ఆదాయం పెంచడంలో సక్సెస్ అయ్యాం. అందరి సహకారంతోనే ఇది సాధ్యమైంది. భవిష్యత్తులోనూ మరింత మెరుగైన సేవలు అందిస్తాం.

– సోలోమన్, రీజినల్ మేనేజర్

సదరం స్లాట్ బుకింగ్‌కు సర్వర్ సమస్య

పాతమంచిర్యాల: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7నుంచి 28వరకు సదరం శిబిరాల నిర్వహణకు ఈ నెల 3నుంచి షెడ్యూల్ విడుదల చేసింది. మరుసటి రోజు నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ప్రకటించింది. దీంతో దివ్యాంగులు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్‌కు వెళ్తే సర్వర్ పని చేయడం లేదని నిర్వాహకులు సమాధానమిస్తున్నారు. జిల్లాలోని మీ సేవ కేంద్రాల్లో ఎక్కడా స్లాట్ బుకింగ్ కావడం లేదు. సదరం శిబిరానికి ఎలా హాజరయ్యేదని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా హాజరయ్యే వారి కంటే గడువు ముగిసిన సర్టిఫికెట్లు రెన్యూవల్ కాకపోతే పింఛన్ కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. కాగా, సదరం శిబిరం నిర్వహిస్తారా లేదా అనే సందిగ్ధం నెలకొంది. ఈ విషయమై ఈడీఎం సునీల్‌ను సంప్రదించగా.. గత 20రోజులు స్లాట్ బుకింగ్‌లు కావడం లేదని, సర్వర్‌లో సాంకేతిక లోపం కారణమని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్‌ను సంప్రదించగా.. దివ్యాంగులకు ఇబ్బందులు కాకుండా ప్రత్యామ్నాయ మార్గం ఆలోచిస్తామని పేర్కొన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి శిబిరం నిర్వహణ ఉంటుందా లేదా త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

కాపర్ వైర్ చోరీ నిందితుల అరెస్టు

తాండూర్: మండలంలోని చౌటపల్లి శివారులో ఉన్న టాటా సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైర్ దొంగిలించిన కేసులో ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. గతనెల 1న రాత్రిన ప్లాంట్‌కు వెళ్లిన దొంగలు పెన్సింగ్ వైర్ కట్ చేసి కాపర్ వైర్ దొంగిలించారు. సూపర్ వైజర్ దూడ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తోడేటి భీమయ్య, తోడేటి వెంకటేష్, ఉరడి రవి, కోయ సురేందర్, ఎడ్ల రాజేశ్ నిందితులుగా గుర్తించిన పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై వెల్లడించారు.

రైలు కిందపడి ఒకరి బలవన్మరణం

మందమర్రిరూరల్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన ప్రవీణ్‌కుమార్ దర్జీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేక తిరుగుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



బండి తనిష్ణ (ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని బాబుక్యాంపు బస్తీకి చెందిన ఓ చిన్నారి జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఎంపీగా పనిచేస్తున్న బండి శ్రావణ్ కుమార్తె బండి తనిష్ణ (4) రెండు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మంగళవారం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో గోదావరిఖని వద్ద మృతి చెందింది. ఈ ఘటన బస్తీలో తీవ్ర విషాదం నింపింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రాజన్నగూడకు చెందిన సిడాం నగేశ్ ద్విచక్ర వాహనంపై ఉట్నూర్‌వైపు వస్తుండగా శ్యాంపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇంద్రవెల్లి మండలానికి చెందిన కుంర రాజు కిందపడిన వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టి కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు శ్యాంపూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ఎస్సై మనోహర్‌ను వివరణ కోరగా ఇంకా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

భీం.. మళ్లీ పుట్టాలి


జోడేఘాట్ గ్రామం

నాడు బ్రిటిష్ కబంధహస్తాల నుండి భారతీయులను విడిపించేందుకు స్వాతంత్య్ర పోరాటం చేశారు మహాత్మాగాంధీ. జల్.. జంగల్.. జమీన్.. అనే నినాదంతో భూమి, నీరు, అడవిపై హక్కులకోసం అప్పటి నైజాం ప్రభుత్వంలోని మిలటరీతో సాయుధ పోరాటం చేసి అసువులు బాసాడు గోండు బిడ్డ కుమురంభీం. భీం మరణించి 84 ఏళ్లు కావొస్తున్నా ఆయన ఆశయం మాత్రం నెరవేరలేదు. నేటికీ తాగు, సాగునీరు, రోడ్డుసౌకర్యం లేక, సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలురాక అలమటిస్తున్న పల్లెలు కోకొల్లలు. అందుకే 'భీం నువ్ మళ్లీ పుట్టాలి' అంటున్నారు ఆదివాసీలు. రేపు కుమురంభీం 84వ వర్ధంతి సందర్భంగా కథనం.


కిలోమీటరు దూరం నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న లైన్‌పటార్ వాసులు

- నెరవేరని గోండు బిడ్డ ఆశయం
- నినాదంగానే జల్ జంగల్ జమీన్..
- ఆగని ఆదివాసీల పోరాటాలు
- అమలు కాని ఆదివాసీ చట్టాలు..
- కొత్త ప్రభుత్వంపై ఆశలు
- రేపు కుమురంభీం 84వ వర్ధంతి

కెరమెరి(ఆసిఫాబాద్): నాటి నుంచి నేటి వరకు ఆదివాసీల పరిస్థితి కడు దయనీయం. భూమి.. నీరు.. అడవిపై ఇంకా వారికి స్వాతంత్య్రం రాలేదు. గిరిజన చట్టాలు గిరిజ నేతరులకు చుట్టాలవుతున్నాయి. అప్పటి నైజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకు భూ బదలాయింపు చట్టం, 1/70 తీసుకువచ్చినా రక్షణ కల్పించే అధికార యంత్రాగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూ బదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిని నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందులో కూడా గిరిజనులను బతకనీయకుండా అధికారులు తరిమేస్తున్నారు. ఆదివాసీ చట్టాలు, భూములకు రక్షణ కల్పించకపోవడం ఎవరి తప్పు? అని అమాయక ఆదివాసీలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వజ్రోత్సవాలు జరుపుకున్నా ఆదివాసీల హక్కులు మాత్రం వారి దరిచేరడంలేదు.

ఉపయోగంలోకిరాని ఐదో షెడ్యూల్

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం అడవి, భూమి, నీటిపై ఆదివాసీలకు పూర్తిహక్కులు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. 2005లో బిల్లు ప్రవేశపెట్టి హక్కులు కల్పిస్తామని గతంలోని ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఏజెన్సీ ప్రాంతంతోని నీటి వనరులు పూర్తిగా ఆదివాసీలకే దక్కాలని రాజ్యాంగంలో ఉంది. కుంటలు, చెరువుల నిర్మాణంలో ఆదివాసీలు భూములు కోల్పోయినా ఆనీరు గిరిజనేతరులకు వినియోగమవుతోంది. ఐటీడీఏ నిధులతో నిర్మించిన కుంటలు, చెరువుల్లో పెంచబడే చేపలు, రొయ్యలపై ఆదివాసీలకే హక్కులు దక్కాలని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే కరువయ్యారు. కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి వలసలు వచ్చిన వారు ఎస్టీలుగా చలామణి అవుతూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు. వారి వలసలను నిరోధించే దమ్ము, ధైర్యం అధికారులకు లేక పోగా వారు ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు సైతం జారీ చేసిన ఘనత వారికే దక్కుతుంది.

కనుమరుగవుతున్న జీవోలు

ఆదివాసీల రక్షణ కోసం గత ప్రభుత్వాలు పొందుపర్చిన జీవోలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగాల్లో వందశాతం గిరిజనులకే చెందాలని ఉన్న జీవో 3ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. 50 శాతం వరకు ఏజెన్సీల్లో గిరిజనులకు మించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫలితంగా ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీల్లో ఏజెన్సీ, నాన్ ఏజెన్సీకి సంబంధం లేకుండా ఏజెన్సీల్లో కూడా గిరిజనేతర ఉద్యోగులను భర్తీ చేసింది. దీంతో ఏజెన్సీ నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు. 1/70 చట్టాన్ని కూడా 2/70 గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇలా ఉన్నఫళంగా ఒక్కొక్కటిగా చట్టాలు మారుస్తుంటే ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం కానుంది.

కొలాం వీరునికి సలాం..!

- నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు
- జోడేఘాట్‌లో రేపు కుమురం సూరు 27వ వర్ధంతి


కుమురం సూరు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని జోడేఘాట్ గ్రామానికి చెందిన కుమురం చిన్ను, మారుబాయి దంపతులకు 1918లో కుమురం సూరు జన్మించారు. చిన్నతనం నుంచి అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఆయన నైజం. గోండు, కొలాం జాతి ప్రజలు వెనుకబడడానికి కారణం నైజాం ప్రభుత్వమేనని గ్రహించిన సూరు నైజాం నవాబులు, వారి తాబేదారులు, రజాకార్లు కొనసాగిస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను సహించలేకపోయాడు. తన జాతిని ఉక్కుసంకెళ్ల నుంచి విముక్తి చేయాలని అనుకున్నాడు. ఆ సమయంలోనే జోడేఘాట్‌కు కుమురంభీం రాక అతనిలో నూతనోత్తేజాన్ని నింపింది. కొలాం, గోండులను ఏకంచేసి కుమురంభీంకు అండగా నిలిచాడు. అలా సమకూరిన బలంతోనే జోడేఘాట్ పరిసరాల్లో 12 గ్రామాలు వెలిశాయి. గ్రామాలను ఆనుకుని ఉన్న వందెకరాల భూమిని ఆదివాసీలు సాగుచేస్తున్నారు. అట్టి భూములను నిజాం రజాకార్లు ఆక్రమించుకున్నారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ నిజాం సాహెబ్‌కు మొరపెట్టుకున్నా స్పందించలేదు. దీంతో పోరాటం తప్పదని భావించిన ఆదివాసీలు కుమురంభీం నాయకత్వంలో సూరుతో కలిసి జల్.. జంగల్..జమీన్ అనే నినాదంతో ఉద్యమం ప్రారంభించారు. అప్పటి నుంచి నైజాం మిలిటరీ ఆదివాసీలు, నాయకులను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడం, చిత్రహింసలకు గురిచేశారు. 1938–40 సంవత్సరంలో ఆసిఫాబాద్ తహసీల్దారు కుమురంభీం, సూరు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారి ఆచూకీ తెలపాలని నైజాం మిలటరీ ఆదివాసీలను చిత్రహింసలు పెట్టింది. ఇలా కొన్నాళ్లు సాగిన యుద్ధంలో అనేక మంది ఆదివాసీలు అసువులు బాసారు. ఈక్రమంలో మడావి కొద్దు 1940లో ఆచూకీ తెలపడంతో కుమురంభీంను కాల్చిచంపారు. అదే పోరాటంలో కుమురంసూరు కుడి చేయి, కుడి కాలు పోగొట్టుకున్నాడు. అనంతరం తన ప్రాణాలను కాపాడుకునేందుకు ఆరుమాసాలపాటు సమతుల గుండంలో తలదాచుకున్నాడు.


జోడేఘాట్‌లోని కుమురం సూరు విగ్రహం

కొలాం ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు కృషి

1980లో కొలాం గ్రామాలలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, కొలాం ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు సూరు కృషి చేశాడు. 1986లో ఐటీడీఏలో కొలాం అభివృద్ధి అధికారిగా సూరును నియమించారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 'ఆదివాసీ కొలాం క్రాంతీవీర్' అనే బిరుదును ప్రదానం చేసింది. ఆగస్టు 10, 1997లో ఆసిఫాబాద్ మండలం శాకన్‌గొందిలో సూరు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో రేపు జోడేఘాట్‌లో అధికారికంగా వర్ధంతిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కొలాం ఆదివాసీలు హాజరుకానున్నారు.

ఆదివాసీల ఓటు బ్యాంకు కోసం..

ఆదివాసీలను ఓటు బ్యాంకుగా నాయకులు వాడుకుంటున్నారు. ఎన్నికలు వచ్చాయంటే స్టేజీలు ఎక్కి మైకులు చేతబట్టుకుని వాగ్దానాల వర్షం కురిపించడమే నాయకుల వంతు. వారి మాటలకు మోగిస్తున్న చప్పట్లతో నాయకుని కార్యమైతే నెరవేరుతోంది. ఆ తర్వాత వర్షం వెలిశాక ఎండలు కొట్టిన చందంగా మారుతున్నాయి గిరిజనుల బతుకులు. నాయకుల మాటలు వినడానికి సొంపుగా ఉంటాయి. కానీ అవి నిజానికి అందనంత దూరంలో ఉంటాయని పాపం వారికి తెలియదు. 1/70 గురించి ఎరుగని వారుండరు. కానీ నేడు ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా మిద్దెలు నిర్మిస్తుంటే వారించే అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప అడ్డుకోవడం లేదు. ఆదివాసీలు ఎప్పటికీ అడవులకే పరిమితమా..? అధికారులు.. నాయకులు.. ఒక్కసారి ఆలోచించండి.

ఇంద్రాదేవి ఆలయంలో దసరా పూజలు


గర్భగుడిలో పూజలు చేస్తున్న భక్తులు


నైవేద్యం తయారు చేస్తున్న ఆదివాసీ మహిళలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవమైన ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీల దసరా పూజలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం మండలంలోని పాటగూడ, జెండాగూడ, వడగామ్, బోరుజ్ గ్రామాలతో పాటు ఉట్నూర్, గుడిహత్నూర్, నార్నూర్, జైనూర్ తదితర మండలాల నుంచి ఆదివాసీలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. నవధాన్యలతో నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సాయిఇంద్రనీల్ గౌడ్ (ఫైల్)

భీమిని: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీగాం గ్రామ పంచాయతీకి చెందిన గట్టు సాయిఇంద్రనీల్ గౌడ్ (32) చార్టెడ్ అకౌంట్ (సీఏ) పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్‌లో బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. గతేడాది భర్త రామగౌడ్, ఇప్పుడు కుమారుడి మృతితో తల్లి తులసీబాయి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. యువకుడి మృతితో వీగాంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అల్లుడిని హత్య చేసిన మామ


నరేందర్(ఫైల్)

భీమిని: కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామ చివరికి అల్లుడి వేధింపులు భరించలేక హతమార్చాడు. ఈ సంఘటన జిల్లాలోని కన్నెపల్లి మండలం షాలిగాం గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు చెందిన గోమాస నరేందర్(37)కు కన్నెపల్లి మండలం షాలిగాం గ్రామానికి చెందిన గోలేటి శంకర్ కూతురు బేబితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఏడాది కాలంగా నరేందర్ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో బేబి పుట్టింటికి వచ్చి ఉంటోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నరేందర్ తన మిత్రుడితో కలిసి వచ్చి మామ ఆస్తిలో వాటా కావాలని గొడవపడి అత్తగారింటిపై తుపాకితో కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో జైలుకు వెళ్లి వచ్చాడు. అదే కక్షతో మంగళవారం షాలిగాంలోని అత్తగారింటికి వచ్చి తీవ్రంగా గొడవపడ్డాడు. ఈ క్రమంలో మామ శంకర్ నరేందర్‌పై గొడ్డలితో దాడి చేసి హతమార్చాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగారాం పేర్కొన్నారు. తాండూర్ సీఐ కుమారస్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీలో చోరీకి పాల్పడిన నిందితుడికి కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న గద్దం మార్కండేయ ఇంట్లో 2022 సెప్టెంబర్ 15న చోరీ జరిగింది. కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సికిందర్ అలీ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న గ్రామ్ బంగారం, వెండి సామగ్రిని అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సంతోష్ చార్జ్ షీట్ దాఖ లు చేశారు. నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జె.ముకేష్ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బెటాలియన్‌లో పోలీస్ స్పోర్ట్స్ మీట్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న అధికారులు


క్రీడాజ్యోతితో కమాండెంట్ వెంకటరాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీ రక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. స్పోర్ట్స్ మీట్ పోలీస్ అధికారులు, సిబ్బందిలో నూతనోత్తేజాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ నెల 18వరకు పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నీ కాయిట్, కబడ్డీ, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాసు, యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ సంతోశ్‌సింగ్, ఆర్ఐలు, ఏఆర్ఎస్సైలు, వ్యాయామ ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం
- ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర ప్రారంభం


పాదయాత్రలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్స్ కాలేజీ వరకు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ చౌక్‌లో అమరులవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. కుమురం భీం, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1200 మంది అమరుల బలిదానాల సాక్షిగా ఉద్యమ పార్టీ ముసుగులో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారుల ఆకాంక్షలకు తూట్లు పొడిచేలా పాలన సాగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు సీట్లు కేటాయించాలన్నారు. ఇందులో సామల ప్రశాంత్, కారింగుల దామోదర్, తుడుం రాములు, నిమ్మల నరేందర్, బాలశంకర్ కృష్ణ, బీసీ సంఘం నాయకులు చిక్కాల దత్తు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామానికి చెందిన కొడిపె మల్లయ్య (45) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొడిపె మల్లయ్య, కొడిపె భీమయ్య ఇద్దరు అన్నదమ్ములు. మల్లయ్య ఇంటి వద్ద ఉన్న బాత్రూం నీళ్ల భీమయ్య గడ్డి వాములోకి వస్తున్నాయని ఆదివారం రాత్రి ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో భీమయ్య క్షణికావేశంలో మల్లయ్య తలపై కర్రతో కొట్టడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.


బిల్డింగ్ పైనుంచి పడి కూలీ మృతి


సంఘటన స్థలంలో మృతదేహం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ మేకల మండి ఏరియాలో నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన నీరజ్ బైసం(35) ఏడాది క్రితం నుంచి తన భార్యతో కలిసి సీసీసీ కార్నర్ వద్ద నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మేకల మండి సమీపంలోని ఓ బిల్డింగ్ నిర్మాణ పనుల నిమిత్తం పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు రెండంతస్తుల భవనం పైనుంచి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కల్పన, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతిలేకుండా అక్రమ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు


ట్రాక్టర్లలో మట్టి నింపుతున్న జేసీబీ

కాసిపేట: ఇసుక, మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలోని దుబ్బగూడెం, ట్యాంక్‌బస్తీ శివారులోని సర్వేనంబర్ 146లో రెండురోజులుగా అధికారపార్టీ మండల నాయకుడు జేసీబీతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తూ ట్రిప్పుకు రూ.450 నుంచి రూ.500 లకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీనిపై స్పందించాల్సిన రెవెన్యూ, మైనింగ్, సింగరేణి, పోలీసు శాఖలు అటువైపు వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై నియోజకవర్గ ప్రజాప్రతినిధి పైరవీ ఉందన్న విమర్శలు వస్తున్నాయి. మట్టి తరలింపును గమనించిన కొందరు పాత్రికేయులు అధికారులకు సమాచారం అందించగా సదరు కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు నిలిపి అక్కడి నుంచి పారిపోయారు. మళ్లీ రాత్రి ఏడుగంటల నుంచి తవ్వకాలు ప్రారంభించారు. దీంతో మట్టి తరలింపులో అన్నిశాఖల అధికారుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా విచారణ జరిపించి ప్రభుత్వ భూమి అయితే కఠినచర్యలు తీసుకుంటామని, సింగరేణి పరిధిలో ఉంటే వారికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఎంత మట్టి తీసింది కొలతల ద్వారా విచారణ జరిపి మైనింగ్ అధికారుల ద్వారా జరిమానా విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

NO DEALER / NO DISTRIBUTOR / DIRECT SALES
అన్నిరకాల బ్రాండ్స్ (కస్టమైజ్డ్ సైజుల్లో లభించును
BGI MANUFACTURERS
Amaravadi 200 Ft. Road, Ramakrishnapur
Cell: 9885558222, 9063170170
HOME LOANS
❖ కన్‌స్ట్రక్షన్స్ ❖ టేక్ ఓవర్ ❖ పర్చేస్ (ఓపెన్ ప్లాట్/బిల్డింగ్)
❖ మార్ట్‌గేజ్ (ప్లాట్ /ఫ్లాట్ / బిల్డింగ్ & ఏసి షీట్స్)
❖ బిజినెస్ లోన్స్ ❖ MSME Loans (Startup/Existing)
DLF హోమ్ లోన్స్
Mancherial, Cell: 98855 58222

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్ ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-796283]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185480]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,